
లోకేష్ మాట ఇచ్చాడంటే
నిలబెడతారనడానికి 'మన ఇల్లు-మన
లోకేష్' కార్యక్రమమే నిదర్శనం.
మంగళగిరిలో 6 వేల మందికి శాశ్వత
ఇంటి పట్టాలు అందించి, రూ.2 వేల
కోట్ల విలువైన భూములను పంపిణీ చేసి
పేదల దశాబ్దాల కలను సాకారం చేశారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 22.07.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 91 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# 'బట్టలు పెట్టి పట్టాలిస్తా'.. హామీ నిలబెట్టా

## 'మన ఇల్లు-మన లోకేష్'లో పేదలకు శాశ్వత పట్టాలు

**వెయ్యికోట్ల విలువైన భూములకు శాశ్వత హక్కులు**

**ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు**

**మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: లోకేష్**



మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా, ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా, అన్నిరంగాల్లో మంగళగిరి నెం. 1గా నిలబడాలి. భారతదేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు -- మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన సభలో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2024 ఎన్నికల తర్వాత మంగళగిరి ప్రజలే నా నమ్మకమయ్యారు. 2019 ఎన్నికల్లో నేను స్థానిక ప్రజలను అర్థం చేసుకునేలోపు ఎన్నికలు అయిపోయాయి, ఫలితంగా 5,300 ఓట్లతో ఓడిపోయాను. రెండురోజులు బాధపడినా మీ మనసు గెలవాలని ఆనాటి నుంచి నా ప్రయాణం ప్రారంభించా. ఐదేళ్లలో ఎప్పుడు ఎవరిని కలిసినా మా భూమికి శాశ్వత హక్కు కావాలని అడుగుతూ వచ్చారు. ఒకేసారి అందరి భూములను రెగ్యులరైజ్ చేయలేను, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పాను. ఈరోజు 3వేలమందికి శాశ్వత పట్టాలు అందజేస్తున్నాం. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు ఎవరు వచ్చి తమ ఇళ్లు, స్థలాలు లాగేసుకుంటారోనని భయంతో బతికారు, ఈరోజుతో ఆ భయం పోతుంది, భూమిపై శాశ్వత హక్కును కూటమి ప్రభుత్వం కల్పిస్తుంది. సుమారు వెయ్యికోట్ల విలువైన భూమిని ఈరోజు అందిస్తున్నాం. మీ భూమిని ఇకపై కుటుంబ అవసరాలకు బ్యాంకులో పెట్టి లోన్ తీసుకోవచ్చు. ఎవరు వచ్చినా మీ భూమిని తీసుకోలేరు.

**మీరిచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది :** 2019 ఎన్నికల తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నాను. కొడుకును గెలిపించుకోలేకపోయావని కొందరు మా నాన్నను అవమానించారు. ఎన్నికలకు ముందు నేను గతంలో ఓటమిపాలైన 5300 పక్కన ఒక్క సున్నా పెట్టి గెలిపించమని చెప్పా. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో టాప్ -3 మెజారిటీ ఇచ్చారు. మీరిచ్చిన బలమే ఇప్పుడు నన్ను ముందుకు నడిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్ల బండిలా సాగుతున్నాయి.

మిగతా 2లో...

## పట్టాభిషేకం... నాన్‌స్టాప్



- **7.30 గంటల నాన్ స్టాప్ పట్టాభిషేకం**
- **ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబడే ఇళ్ల పట్టాల పంపిణీ**
- **తొలిరోజు 1331మందికి శాశ్వతపట్టాలు అందించిన మంత్రి లోకేష్**
- **తండ్రికి మించిన ఓపిక తనయుడికి అంటూ ప్రజల ప్రశంసలు**

మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) : నాన్ స్టాప్ పట్టాభిషేకానికి సీకే కన్వెన్షన్ సెంటర్ వేదిక అయింది. దాదాపు 7.30 గంటల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడుగు తీసి అడుగు మార్చకుండా నిలబడే ఉన్నారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని 1331మంది లబ్ధిదారులకు మన ఇల్లు -– మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేష్ తొలిరోజు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు.

మిగతా 2లో...

### రూ.100 కోట్లతో

## యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



- **ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు నాందిలి**
- **ఏపీ ఈడీబీతో యూఏఈ అవగాహనా ఒప్పందం**
- **ఫుడ్ ప్రాసెసింగ్ లో యూఏఈ పెట్టుబడులకు మార్గం సుగమం**
- **తొలి పెట్టుబడిగా చిత్తూరులో యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్**
- **రూ.100 కోట్లతో పెట్టుబడితో ముందుకు వచ్చిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్**
- **సీఎం చంద్రబాబు, యూఏఈ మంత్రి అబ్దుల్లాబిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ**

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఈ ఏడాది దావోస్ లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఏపీలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఏపీ ఈడీబీ-యూఏఈకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, యూఏఈ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో యూఏఈ ప్రతినిధుల బృందం

మిగతా 2లో...


## కోవిడ్‌పై ప్రభుత్వం ఫుల్ అలర్ట్



- **ప్రతి ప్రభుత్వాసుపత్రి సిద్ధం.. కిట్లు, మందులు, ప్రత్యేక పడకలతో వైద్యశాఖ అప్రమత్తం**
- **17 బోధనాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు.. అత్యవసర కొనుగోళ్లకు డీఎంఈ అనుమతి**
- **కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు ముమ్మరం**
- **అధికారులకు మంత్రి సత్యకుమార్ అప్రమత్తత ఆదేశాలు**

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో నమోదవుతున్న కోవిడ్ కేసుల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలను వైద్య, ఆరోగ్య శాఖ మరింత వేగవంతం చేసింది. కేసుల సంఖ్యపై ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తూనే, అనుమానితులకు పరీక్షలు, బాధితులకు తక్షణ చికిత్స అందించేలా ప్రభుత్వాసుపత్రులను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తోంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పరీక్షల కిట్లు, మందులు, ప్రత్యేక పడకలు, రక్షణ సామగ్రి, అత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. గత వారం మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రజలు కోవిడ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వైద్య శాఖ మాత్రం అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించేలా అన్ని ప్రభుత్వాసుపత్రులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

మిగతా 2లో...



### కాలుష్య రహిత

## ఐటీ హబ్‌గా విశాఖ



- **బల్క్ కార్గో హ్యాండ్లింగ్‌ను దశలవారీగా మూలాపేట పోర్టుకు మళ్లింపు**
- **మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

2 లో

## పరిశ్రమలే లక్ష్యం... కేంద్రం చేయూత కావాలి

- **'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త'కు సహకారం అందించండి**
- **కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయండి**
- **పీఎంఈజీపీ నిధులు పెంచండి**
- **న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు జితన్ రామ్ మాంఝీ, శోభా కరంద్లాజేలను కోరిన మంత్రి కొండపల్లి**

2 లో

### వెడ్డింగ్ హబ్‌గా

## ఏపీకి పురస్కారం



- **జైపూర్‌లో 'ఎమర్జింగ్ స్టేట్' అవార్డు అందుకున్న మంత్రి దుర్గేష్**

రాజస్థాన్(జైపూర్) / అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాజస్థాన్ లోని జైపూర్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో అరుదైన గౌరవం దక్కింది. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు, ఈ రంగంలో కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు గాను ఏపీకి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు పురస్కారం లభించింది.

మిగతా 2లో...

## రైతుల కోసం ఢిల్లీలో అచ్చెన్న

- **గిట్టుబాటు ధరలు.. కేంద్ర సహకారంపై శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ**
- **వ్యవసాయాభివృద్ధి, ఆధునికీకరణపై విస్తృత చర్చలు**

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను ఢిల్లీలో కలిశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయాల బలోపేతం, రైతుల ఆదాయ పెంపుపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రికి వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో

మిగతా 2లో...



## ఐదేళ్ల భూ అక్రమాలపై చర్యలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టంచేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే.. వారు కూడా దీనిపై సానుకూలంగా స్పందించారన్నారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు.. ఒక నూతన సాంకేతిక విధానమని తెలిపారు. గొడ్డలి పార్టీ రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. తమ్మినేని భూ అక్రమాలతో పాటు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. గత 5 ఏళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

### ఫ్యూచర్-రెడీ పోలీసింగ్‌తో

## నేరాలపై ఉక్కుపాదం

- **ఆధునిక సాంకేతికతతో దేశానికే ఆదర్శంగా ఏపీ పోలీస్ వ్యవస్థ**
- **హోంమంత్రి అనిత**



విజయవాడ, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్): నేరాల స్వరూపం సాంకేతికత ఆధారంగా వేగంగా మారుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ కూడా అంతకంటే ఆధునికంగా, వేగవంతంగా, ప్రజాకేంద్రీకృతంగా మారాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'ఫ్యూచర్-రెడీ ఏపీ పోలీస్ రిట్రీట్-2026' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2001లో ప్రారంభమైన పోలీసు సంస్కరణల రిట్రీట్‌ను 25 ఏళ్ల తర్వాత పునరుద్ధరించడం చారిత్రాత్మకమని పేర్కొంటూ, భవిష్యత్ సవాళ్లకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతకలహాలను గణనీయంగా అదుపులోకి తీసుకువచ్చామని, ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, మహిళలపై నేరాలు సుమారు నాలుగు శాతం తగ్గాయని తెలిపారు. గంజాయి నిర్మూలనకు 'ఈగల్' వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని, 112 అత్యవసర సేవల స్పందన సమయాన్ని కూడా గణనీయంగా తగ్గించినట్లు వెల్లడించారు.

పోలీసు శాఖ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే 6 వేల కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామని,

మిగతా 2లో...

## కాలుష్య రహిత ఐటీ హబ్‌గా విశాఖ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి ఐటీ సేవలు, పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో విశాఖ పోర్టులో ప్రస్తుతం నిర్వహిస్తున్న బొగ్గు, ఖనిజాలు తదితర కాలుష్య కారకాల బల్క్ కార్గో హ్యాండ్లింగ్‌ను దశలవారీగా మూలాపేట పోర్టుకు మళ్లించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ అంశాన్ని ఇప్పటికే రామాయపట్నం పోర్టు వ్యవహారాల కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలతో మూలాపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభం నుంచే వాణిజ్యపరంగా బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం విశాఖ పోర్టులో జరుగుతున్న బల్క్ కార్గో నిర్వహణ వల్ల నగరంలో దుమ్ము, వాయు కాలుష్యం పెరుగుతోందని, కార్గోను మూలాపేటకు తరలిస్తే విశాఖ పోర్టుపై ఒత్తిడి తగ్గడంతో పాటు ఓడల టర్న్ అరౌండ్ సమయం మెరుగుపడి షిప్పింగ్ సంస్థల వ్యయభారం కూడా తగ్గుతుందని మంత్రి వివరించారు. అదే సమయంలో విశాఖ నగరంలో కాలుష్యం తగ్గి ప్రజల జీవన నాణ్యత మెరుగుపడటంతో పాటు స్థానిక పారిశ్రామికాభివృద్ధికి కూడా ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ పోర్ట్ అథారిటీ ప్రతిపాదనల ప్రకారం మూలాపేట పోర్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌లో 49–50 శాతం ఈక్విటీ భాగస్వామ్యం, నామినేషన్ లేదా రైట్ ఆఫ్ ఫస్ట్ రిఫ్యూజల్ విధానంలో నాలుగు బెర్తుల కేటాయింపు, ఎస్పీవీకి బదిలీ చేసే ఉప్పు భూములకు న్యాయమైన విలువ నిర్ణయించే అంశాలను కూడా జీఓఎం సమగ్రంగా పరిశీలించనుంది. మంత్రుల కమిటీకి పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించి తుది సిఫార్సుల రూపకల్పనలో భాగస్వాములు కానున్నట్లు మంత్రి తెలిపారు.

## పరిశ్రమలే లక్ష్యం... కేంద్రం చేయూత కావాలి

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి మరింత సహాయ సహకారాలు ఉండాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న కొండపల్లి మంగళవారం రాత్రి కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజేతో 28 అక్బర్ రోడ్‌లోని రామ్ జీ స్వగృహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను 100 % కు మించి 170 % వరకు సాధించిన నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేటాయింపులు మరింతగా పెంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కడప జిల్లాలోని కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని... ఎస్కే యూనివర్సిటీ, విజయనగరం జేఎన్‌టీయూలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల ఏర్పాటు కార్యాచరణను వేగవంతం చేయాలని మంత్రి మాంఝీ గారిని కోరగా అందుకు మాంఝీ సుముఖత వ్యక్తం చేశారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెప్టెంబర్ 11 - 13వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో కార్యక్రమానికి మాంఝీని మంత్రి కొండపల్లి సాదరంగా ఆహ్వానించారు.

## అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వోపై సస్పెన్షన్

**పాడేరు (జర్నలిస్ట్ ఫైల్):** అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనధికారిక డిప్యుటేషన్లు, ఉద్యోగుల వేధింపులు, పరిపాలనా విధానాల ఉల్లంఘన, ఇతర అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

## టిడిపి నేతలకు ఘన సత్కారం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బ్రహ్మం సాగర్ ఎడమ కాలువ నుండి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేయుటకై విచ్చేసిన బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మరియు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ కు బి మఠం ఎంపీపీ చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి మరియు మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి ఎంపిపి కార్యాలయం నందు ఘనంగా పూలమాలవేసి దృశ్యాలువాతో సత్కరించారు.

## ఫ్యూచర్-రెడీ పోలీసింగ్‌తో నేరాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో ప్రతి జాబ్ క్యాలెండర్‌లో కొత్త పోస్టులను భర్తీ చేస్తామని అనిత తెలిపారు. నూతన తరహా నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజుల రిట్రీట్‌లో సైబర్ భద్రత, మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, రౌడీయిజం నిర్మూలన, ఫ్యాక్షన్ రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతసామరస్య పరిరక్షణ వంటి ఆరు కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, రాబోయే 20 ఏళ్ల సవాళ్లను దృష్టిలో ఉంచుకుని 10 కీలక అంశాలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని తెలిపారు. సంప్రదాయ పోలీసింగ్‌కు బదులుగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డ్రోన్ నిఘా, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నేర నిరోధక వ్యవస్థలు, కోడింగ్, క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీలో నైపుణ్యం కలిగిన యువతను పోలీసు శాఖలోకి తీసుకురావడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

0-3, 3-7, 7-20 సంవత్సరాల దశలవారీ కార్యాచరణతో ఆధునిక పోలీసింగ్‌ను అమలు చేస్తామని డీజీపీ తెలిపారు. నేరం ఎంత ఆధునికమైనా ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ దానికంటే ఒక అడుగు ముందే ఉంటుందని హోంమంత్రి అనిత స్పష్టం చేస్తూ, సాంకేతికత, వేగవంతమైన స్పందన, పారదర్శకత, ప్రజల విశ్వాసం ఆధారంగా ఫ్యూచర్-రెడీ పోలీస్ వ్యవస్థను నిర్మించి దేశానికే ఆదర్శంగా నిలబెడతామని పేర్కొన్నారు.

# 'బట్టలు పెట్టి పట్టాలిస్తా'.. హామీ నిలబెట్టా

(మొదటి పేజీ తరువాయి)

మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 24గంటలు తాగునీరు, పార్కులు, శ్మశానాల అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రస్థాయిలో 4వేల పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నక్యాంటీన్లు వంటివి అమలు చేస్తున్నాం. ప్రజలంతా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. గతంలో రాష్ట్ర ఆదాయం రూపాయి అయితే ఖర్చు 1.60పైసలు ఉండేది. గత రెండేళ్లుగా అహర్నిశలు కష్టపడి పరిశ్రమలు తెచ్చి, ఆగిపోయిన పనులు ప్రారంభించాం. ఇప్పటికీ రూపాయి ఆదాయానికి ఖర్చు 1.40పైసలుగా ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.

**ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించండి :** ఎన్నికల సమయంలో బట్టలు పెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నేడు నెరవేర్చా. ఏపీలో టిడిపి, జనసేన, బిజెపి కలసికట్టుగా పనిచేస్తున్నాయి. డిల్లీలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. ప్రధానిమంత్రి మోదీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ కల నెరవేర్చారు. పోలవరం, అమరావతికి నిధులిచ్చారు. అమరావతికి చట్టబద్ధత కల్పించారు. బాబుగారిని తప్పుడు కేసులో జైలుకు పంపినపుడు అన్నగా నిలబడతా అని పవనన్న భరోసా ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టేందుకు అందరం కలసి పనిచేస్తున్నాం. మీరిచ్చిన బాధ్యతను పద్ధతి ప్రకారం ముందుకు తీసుకెళ్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంతో పాటు మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నా. మంగళగిరి అభివృద్ధికి అన్నివిధాలు సహాయ, సహకారాలు అందిస్తున్న మోదీజీ, చంద్రబాబు, పవనన్నకు ధన్యవాదాలు. పట్టాల పంపిణీకి ముందుకు మూడు పార్టీల నాయకులు మీ ఇళ్లకు వచ్చారు.



ఒక కప్పు కాఫీ కూడా తీసుకోలేదు. పారదర్శకంగా వాస్తవ లబ్ధిదారులకు ఈరోజు పట్టాలు పంపిణీ చేస్తున్నాం, మీ అందరి కోసం పనిచేస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీం-ర్వదించాలని మంత్రి లోకేష్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, జనసేన ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నేతలు పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్‌పై ప్రభుత్వం ఫుల్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ యధావిధిగా రోజూ వారీ చర్యల్లో మాదిరిగానే మంగళవారం కూడా డీఎస్‌హెచ్ డాక్టర్ చక్రధర్‌బాబు, డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్, ప్రజారోగ్య శాఖ, ఏపీఎంఎస్ఐడీసీ తదితర విభాగాల అధికారులతో వర్చువల్ సమీక్ష నిర్వహించి సన్నద్ధత పై చర్చించారు. కోవిడ్ ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దశల వారీ కార్యాచర ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను కార్యదర్శి ఆదేశించారు



**ప్రత్యేక పడకలు.. రక్షణ సామగ్రి :** రాష్ట్రంలోని లి17 బోధనాసుపత్రుల్లో మొత్తం 255 ప్రత్యేక కోవిడ్ పడకలను సిద్ధం చేశారు. సెకండరీ ఆసుపత్రుల్లోనూ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక పడకలను కేటాయించేందుకు ఏర్పాట్లు జరిగాయి. బోధనాసుపత్రుల్లో 6,77,936 ట్రిపుల్ లేయర్ మాస్కులు, కేంద్ర ఔషధ నిల్వ కేంద్రాల్లో మరో 5.26 లక్షల మాస్కులు ఉన్నాయి. అదనంగా 58,790 ఎన్-95 మాస్కులు, 4,436 పీపీఈ కిట్లులిలి,2,572 శానిటైజర్లు అందుబాటులో ఉంచారు. కోవిడ్ చికిత్సకు అవసరమైన యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ తదితర మందుల నిల్వలు కూడా తగిన స్థాయిలో ఉన్నాయని అధికారులు తెలిపారు.

**స్థానిక కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ :** రెమిడిసివిర్ ఇంజెక్షన్లు, టెస్టింగ్ కిట్లు, శానిటైజర్లు తదితర అత్యవసర సామగ్రిని వెంటనే కొనుగోలు చేసేందుకు ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు లోకల్ పర్చేజ్ అధికారాలు కల్పిస్తూ డీఎంఈ 3 రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి సరఫరా కోసం వేచి చూడకుండా అవసరమైన సామగ్రిని స్థానికంగానే సమకూర్చుకునే వెసులుబాటు కల్పించడంతో అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం కానుంది.

**ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా భారీ కొనుగోళ్లు :** ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా లి51,700 ఆర్ఎన్ఏ ఎక్స్‌ట్రాక్షన్ కిట్లు, 27,552 ఆర్టీపీసీఆర్ కిట్లు,, పీసీఆర్ టిప్స్, ఫిల్టర్ టిప్స్, మైక్రో ట్యూబ్స్, నైట్రైల్ గ్లౌస్ కొనుగోళ్లకు ఏపీఎంఎస్ఐడీసీ ఆర్డర్లు జారీ చేసింది. అదనంగా ప్రతి ఆసుపత్రికి 50 చొప్పున రెమిడిసివిర్ ఇంజెక్షన్లు అందించే చర్యలు చేపట్టింది.

**సరఫరా చివరి దశలో :** మైక్రో ట్యూబ్స్, నైట్రైల్ గ్లౌస్ సరఫరా తుది దశకు చేరుకోగా, పీసీఆర్ స్ట్రిప్స్, ఫిల్టర్ టిప్స్ పంపిణీ ప్రారంభమైంది. మరో ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన సామగ్రి కూడా ఆసుపత్రులకు చేరనున్నట్లు అధికారులు తెలిపారు.

**అప్రమత్తతే ముఖ్యం.. భయం వద్దులిలి:** రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. స్వల్ప లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని, పరీక్షలు, చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

# బ్రహ్మం సాగర్ నుంచి లెఫ్ట్ కెనాల్‌కు సాగునీటి విడుదల

- **రైతులకు సకాలంలో నీరందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** రైతులకు సకాలంలో సాగునీరు అందించి వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు నుంచి లెఫ్ట్ కెనాల్‌కు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జ్, జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డితో కలిసి సాగునీటిని విడుదల చేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా నీటి నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలని తెలుగుగంగ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. బ్రహ్మంసాగర్ లో 9 టీఎంసీలు నీరు నిల్వ ఉంది బ్రహ్మం సాగర్ ఆయకట్టు కింద ఉన్న రైతులకు 46 వేల ఎకరాలు పంటకు పొలాలకు నీరు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు. మంగళవారం ఎడమ కాలువ ద్వారా రైతులకు రోజుకు 200 క్యూసెక్కుల చొప్పున విడుదల జరుగుతుంది ఆయన అన్నారు. గతంలో కుడి కాలువ ద్వారా రైతులకు ఇబ్బంది ఉండకూడదని రోజా 100 క్యూసెక్కులు నేను విడుదల చేయడం జరిగిందని అన్నారు. అలాగే ముందు జాగ్రత్తగా గతంలో కాలువలను మరమత్తు చేయించి బ్రహ్మం సాగర్ లో నీళ్లు నిలువ ఉంచడం వల్ల ఇప్పుడు రైతులకు మేలు అయిందని అన్నారు.

తెలుగంగ అధికారి ఎస్.ఈ మల్లికార్జున, ఈ ఈ మధుసూదన్ రెడ్డి డి ఇలు మురళీమోహన్ కుమార్, వెంకటేశ్వర్లు, ఏఈఈ ముద్దం నాగేశ్వరరావు, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి తెలుగుదేశం మండల సీనియర్ నాయకులు ముదుమాలపోలిరెడ్డి ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున్ రెడ్డి సొసైటీ అధ్యక్షుడు సాంబశివరెడ్డి పూజా శివయ్య యాదవ్ నరసింహ గౌడ్ చెన్నుపల్లి జయరామి రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి యనమల సుధాకర్ టిడిపి పార్టీ అభిమానులు కార్యకర్తలు అన్ని పార్టీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుగంగ శాఖ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రైతుల కోసం ఢిల్లీలో అచ్చెన్న

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అచ్చెన్నాయుడు తెలిపారు. పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రైతులకు మరింత కేంద్ర సహకారం అందించాలని, పంటల ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అచ్చెన్నాయుడు, పంట నష్టపరిహారం, బీమా ప్రయోజనాలు సకాలంలో అందేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచాలని కోరారు. అలాగే డ్రోన్ టెక్నాలజీ, డిజిటల్ వ్యవసాయం, యాంత్రీకరణ, నీటి సమర్థ వినియోగం వంటి ఆధునిక సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. గోదాములు, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కూడా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందిస్తూ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు సానుకూలంగా స్పందించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు.

## పట్టాభిషేకం... నాన్‌స్టాప్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు ప్రతి లబ్ధిదారుడ్ని ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి లోకేష్ పట్టాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ పట్టా పత్రంతోపాటు నూతన వస్త్రాలను బహుకరించారు. ఓపిక, పట్టుదల విషయంలో యువనేత లోకేష్ తండ్రిని మించి పోయారని నాయకులు కొనియాడారు.

## వెడ్డింగ్ హబ్‌గా ఏపీకి పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక అవార్డును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సోమవారం రాత్రి జైపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని ఏపీ సర్కార్ పర్యాటకాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. "దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు ఏపీయే ఫేవరెట్ స్పాట్ గా ఉండేలా చేస్తామన్నారు. అందమైన లొకేషన్లు.. అద్భుతమైన ఆతిథ్యం తో పాటు రాబోయే రోజుల్లో ఏపీని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే కేరళలో గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ అందించిన బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డు మరియు గోవాలో ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో అరకు కు మోస్ట్ ఇన్ స్టాగ్రామబుల్ ల్యాండ్ స్కేప్ అవార్డును అందుకున్నామని, ఇప్పుడు మరో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రూ.100 కోట్లతో యూఏఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహారశుద్ధి రంగంలో ఏపీలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకో లాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం లాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏపీలోని చిత్తూరులో రూ.100 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యూఏఈ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఏపీలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయనుంది.



**క్వాంటం స్పీడ్ తో అవకాశాలు అందుకోండి :** దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యూఏఈ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఏపీ వేదిక కావటం సంతోషదాయకమని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీ రంగాల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఏడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ. 1 లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సీఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఏపీ ఎగుమతులు చేస్తోందని సీఎం యూఏఈ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణా-గోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీకి ఓ విధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఏపీ లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధ రంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి యూఏఈ బృందానికి తెలిపారు. క్వాంటం స్పీడ్ తో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూలంగా నిర్మిస్తున్న అమరావతిని మరో నివాసంగా మార్చుకోవాలని యూఏఈ ప్రతినిధులను సీఎం కోరారు.

**ఏపీ-యూఏఈ మధ్య ఫుడ్ కారిడార్ :** కృష్ణా-గోదావరి లాంటి నదులున్న ఆంధ్రప్రదేశ్ లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని యూఏఈ ఎకానమీ, టూరిజం విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ నేత సీఎం చంద్రబాబు నాయుడు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. భారత్- యూఏఈ వాణిజ్య బంధంలో భాగంగా ఏపీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా పని చేస్తున్నామని తెలిపారు.

ఏపీలోని రొయ్యలు, అరటి లాంటి ఉద్యాన ఉత్పత్తులు వాణిజ్యంలో కీలకంగా ఉన్నాయని అన్నారు. ఏపీలో ఫుడ్ పార్క్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ సహా వివిధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తూ వాణిజ్యాన్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించటం సంతోషదాయకమని ఆయన ప్రశంసించారు. అమరావతి నుంచి న్యూయార్క్ మార్కెట్ వరకూ కు డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్ , పప్పు దినుసులు తదితర రంగాల్లో ఎగుమతులపై దృష్టి పెడతామని అన్నారు. కృష్ణపట్నం, కాకినాడ నుంచి యూఏఈకి షిప్పింగ్ రూట్లోనూ వాణిజ్యం మరింత పెరిగేందుకు సహకరిస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. ఏపీ-యూఏఈల మధ్య బంధం మరింత వేగంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ స్పష్టం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో యూఏఈకి ఫుడ్ క్లస్టర్ చైర్మన్ సలేహ్, యూఏఈ సహాయ కార్యదర్శి మారియా అల్ ఖాసిమ్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అనూషా అల్ మర్జూఖీ, యూఏఈ ఎంబసీ నుంచి అహ్మద్ అల్ జ్నేబీ, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్ , పరిశ్రమలు, ఈడీబీ, ఆర్థికశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నిరుద్యోగుల జీవితాలతో రాజకీయాలు చేసిన బీఆర్ఎస్

- వారి గురించి మాట్లాడే నైతిక హక్కు బీ.ఆర్.ఎస్.కు లేదు..
- బీ.ఆర్.ఎస్. పాలనలో నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కారం కాలేదు..
- కల్వకుంట్ల కుటుంబ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది..
- సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల పట్ల సానుకూలంగా వున్నారు..
- ఇప్పటికే 70 వేలకు పైగా ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించాం..
- రాష్ట్రంలోని ప్రతి ఖాళీని భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది...
- వివరించిన దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి..



**దేవరకద్ర జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ సమస్యను విస్మరించి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిన నాయకులు ఇప్పుడు రిక్రూట్‌మెంట్‌పై మాట్లాడడం హాస్యాస్పదం. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన "ఇంటికో ఉద్యోగం" 3 వేలు నిరుద్యోగ భృతి, కొత్త నోటిఫికేషన్లు వేయకపోవడం, పేపరు లీకులు చేసి పల్లి,బఠానీల్లా అమ్ముకోవడం,10 ఏళ్ళు అధికారంలో ఉండి గ్రూప్-1 నోటిఫికేషన్ వేయడం చేతకాలేదు, అప్పుడప్పుడు ఏవో నోటిఫికేషన్లు వేయడం నియామక పత్రాలు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడి ఇచ్చిన హామీని అమలు చేయకుండా యువత ఆశలను వమ్ము చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యం ఇస్తూ వరుసగా నియామక ప్రక్రియలను చేపడుతోంది. అయినప్పటికీ, బీఆర్ఎస్ యువతను మరోసారి తప్పుడు ప్రచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. పదేళ్ల భారస పాలనలో నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కంటే కల్వకుంట్ల కుటుంబ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది బీఆర్ఎస్.

తెలంగాణ నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి ప్రలోభాలకు గురికావద్దు అని ఎమ్మెల్యే జిఎమ్మార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం నకిలీ నిరుద్యోగులతో భారస పెయిడ్ బ్యాచ్, నాయకులు, కార్యకర్తలు యువ సంగ్రామ సభ అంటూ డ్రామాలు చేసింది. నిరుద్యోగుల జీవితాలతో రాజకీయాలు చేసిన బీఆర్ఎస్‌కు వారి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల సానుకూలంగా ఉంది. ఇప్పటికే 70 వేలకు పైగా ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించాం. ప్రతి ఖాళీని భర్తీ చేసేందుక సిద్ధంగా ఉంది. రాజకీయాలకు అతీతంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత బీఆర్ఎస్ మోసపూరిత మాటలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**: సీఐటీయూ డిమాండ్..**

**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీఐటీయూ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ డిమాండ్ చేశారు. పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్ అరెస్టును నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యార్థులు, యువత, మేధావులు కేంద్ర విద్యాశాఖ మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్‌ను అక్రమంగా అరెస్టు చేసి, ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.




ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై నిర్బంధ చర్యలు చేపట్టడం సరైన విధానం కాదన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యువతపై నిర్బంధాన్ని నిలిపివేయాలని, అక్రమంగా నిర్బంధంలో ఉంచిన సోనం వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో శివకుమార్, చిన్న, వెంకటేష్, నిజాం, మల్లేష్ తదితర సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# పెద్దవంగర తహసీల్దార్ కార్యాలయంలో లంచాల వరస

- ఏసీబీకి పట్టుబడ్డ మారని కార్యాలయ అధికారుల తీరు..
- లంచం ఇస్తేనే సర్వే రిపోర్టు ఇస్తానన్న సర్వేయర్‌పై ప్రజావాణిలో కలెక్టరుకు ఫిర్యాదు

**పెద్దవంగర జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** భూమి సర్వే చేసి నివేదిక (ఖీ-హాఊఅవ రిపోర్ట్ ) అందజేయడానికి ఒక ప్రభుత్వ సర్వేయర్ బాహాటంగా లంచం డిమాండ్ చేస్తూ హద్దు మీరి ప్రవర్తిస్తున్నాడనే ఉదంతం సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వెలుగుచూసింది. లంచం ఇస్తేనే గానీ పత్రాలు చేతికి ఇవ్వనంటూ సదరు అధికారి వేధిస్తున్నాడంటూ ఒక బాధితుడు జిల్లా కలెక్టరుకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. బాధితుడు వివరాల ప్రకారం పెద్దవంగర మండలం, చిట్యాల గ్రామానికి చెందిన ఆవుల మహేష్ (33), తండ్రి వెంకట్రాములుకు చెందిన సర్వే నంబర్లు 321, 326, 328 లలోని భూమిని సర్వే చేయాల్సిందిగా గత ఏడాది 13-05-2025 న మరియు తిరిగి 27-10-2025 న ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు సార్లు మీసేవ ద్వారా F-Line పిటిషన్ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఆధారంగా క్షేత్రస్థాయికి వచ్చిన పెద్దవంగర మండల సర్వేయర్ భూమిని కొలిచినప్పటికీ.. తుది నివేదిక ఇవ్వడానికి మాత్రం బాధితుడి నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 18-07-2026 న బాధితుడు సర్వేయర్ కార్యాలయానికి వెళ్లి తన సర్వే రిపోర్టు ఇవ్వాలని కోరగా, సదరు అధికారి లంచం డబ్బులు ఇస్తేనే రిపోర్టు ఇస్తానని ఖరాఖండిగా చెప్పడమే కాకుండా, బాధితుడి పట్ల అత్యంత దురుసుగా, అగౌరవంగా ప్రవర్తించాడని ఆరోపించారు. ప్రభుత్వానికి ఫీజులు కట్టి, ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నిరుపేదలకు న్యాయం జరగడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా కలెక్టర్, తక్షణమే ఈ అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మరియు సదరు మండల సర్వేయర్‌పై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. బాధితుడికి త్వరితగతిన న్యాయబద్ధమైన సర్వే రిపోర్టు అందేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.



# జయముఖి కళాశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని ధర్నా

**- పిడిఎస్‌యు ఆధ్వర్యంలో**

**నర్సంపేట జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక నర్సంపేట లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడుతూ, నర్సంపేట డివిజన్లో ఉన్న జయముఖి ఇంజనీరింగ్ కళాశాల "అటనమస్" గత రెండు నెలలుగా విద్యార్థులకు ప్రాక్టికల్స్, సెమిస్టర్లు నిర్వహించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటంమాడుతున్నారని వారు మండిపడ్డారు. విద్యార్థుల నుండి అనేక రూపాలుగా ట్యూషన్ల పేరిట, హాజరు పేరిట, అడ్మిషన్ పేరిట, ట్రావెలింగ్ పేరిట, లైబ్రరీ పేరిట, టెస్టుల పేరిట, సర్టిఫికెట్స్ పేరిట, అనేక రూపాలుగా విద్యార్థుల నుండి డబ్బులు లాగుతూ ఈరోజు వారికి కూడా సెమిస్టర్లు పెట్టనీ దుస్థితి జయముకి కళాశాలలో నెలకొందని వారు అన్నారు. ఈ రోజు విద్యార్థుల తమ భవిష్యత్తు కోసం, వారి కలల కోసం, చదువుతున్న చదువుకు అర్థమేలేని పరిస్థితి కనబడు తున్న సందర్భంగా విద్యార్థులు స్పందించి వరంగల్ రోడ్ సెంటర్లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద రాస్తారోకో చేయడం జరిగింది. ఇలా అనేక రూపాలుగా కలెక్టర్‌కి, డిఈఓకి, స్థానిక ఎమ్మెల్యేకి, వినతిపత్రం అందజేసిన కూడా స్పందించని వైనంగా ప్రభుత్వ అధి కారులు మారుతున్న మా సమస్యను తీర్చుకుంటామంటూ రోడ్డు ఎక్కిన పరిస్థితి మన నర్సంపేట డివిజన్లో కనబడుతా ఉంది. ఈరోజు ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న దోపిడిని నెలకొన్న సమస్యలని ప్రభుత్వాన్ని ఎందుకు పెదచెవిన పెడుతున్నాయని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా జయముఖి కళాశాల యజమాన్యం మేల్కొని విద్యార్థులకు సెమిస్టర్లు, ప్రాక్టికల్స్ నిర్వహించి వారి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలవాలని వారు కోరారు. లేనియెడల పి డి ఎస్ యు ప్రగతిల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంగా అనేక రూపాలుగా కార్యక్రమాలు నిర్వహించి జయముకి కళాశాల యజమాన్యం మెడలు వంచుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు డివిజన్ నాయకులు సిద్ధు, సుభాష్ చంద్రబోస్, రాకేష్, ఉషా కిరణ్, జయముఖి కళాశాల విద్యార్థులు స్పందన, కీర్తి, వైశాలి, శ్వేత, కిషోర్, కళ్యాణ్, శ్యామ్, స్పందన పాల్గొన్నారు.



## హమాలి కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలి

**- రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్**




**నర్సంపేట జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక నర్సంపేట పట్టణము యందు తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవన బోయిన రాంబాబు ఆధ్వర్యంలో అమాలి కార్మికుల వేతనాలు ప్రతినెల సమయపాలన పాటిస్తూ చెల్లించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు, నాయకులు పాల్గొనగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం గేటు ముందట ధర్నా చేసి తదుపరి కలెక్టర్ సత్య శారదా కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ, వరంగల్ జిల్లా లో అన్ని సివిల్ సప్లై గోదాములలో హమాలి కార్మికులు మూడు నెలలుగా పని చేయగా జీతాల జాప్యంతో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40% అంటూ విభజన రూపంలో నెలసరి జీతాలు మరో నెల వచ్చే వరకు కూడా జీతాలు ఆలస్యంగా కుటుంబ ఆర్థిక ఇబ్బందులకు అనేక రకాలుగా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్రం మూడు నెలలుగా బియ్యం పంపిణీ చేయాలని తెలపడం కార్మికుడి కుటుంబ ఆర్థికానికి కుంటుపడే పరిస్థితి వల్ల ప్రతినెల ఐదో తారీకు కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంపల్లి మునీశ్వర్, జలగం బిక్షపతి, ముద్ర బోయిన మహేందర్, కందిక చెన్నకేశవులు, గోవర్ధన్ మియాపురం, దేవనబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- బీజేపీ నేత ఎస్.రామచంద్రారెడ్డి**



**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లాలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అయిజ పట్టణంలోని భగత్ నగర్‌లో పట్టణ అధ్యక్షుడు తెలుగు నరసింహ ఆధ్వర్యంలో చేనేత కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 7 వేల మంది చేనేత కార్మికులు ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేనేత రుణమాఫీ ఇప్పటి వరకు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. అలాగే త్రిఫ్ట్ ఫండ్ గత 14 నెలలుగా కార్మికుల ఖాతాల్లో జమ కాలేదని, చేనేత భరోసా పథకం కింద రెండున్నర సంవత్సరాల కాలంలో కేవలం మూడు నెలలకే ఆర్థిక సాయం అందిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పంపిన లిఫ్ట్ మిషన్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంపాటి భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, తూముకుంట అంజి, సిద్దార్థ, బింగిదొడ్డి లక్ష్మణ్, బెల్లంకొండ నాగరాజు, రాజశేఖర్, రఘు, ఖుషీ, సి.నరసింహ, వీరరాఘవ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందాలి..

**- అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు**



**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు ఆదేశించారు. సోమవారం మల్దకల్ మండలం బిజ్జారం (పరమాల) గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆహార నాణ్యత, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, బెడ్‌షీట్లు పంపిణీ చేసి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదివి జీవితంలో రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో ఐటిటీపీ ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం



**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎర్రవల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఎస్‌జీటీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కోసం ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమం సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ కొండేర్‌లో ప్రారంభమైంది.

ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి అమీర్ పాష మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవం తంగా అమలు చేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వరదసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. శిక్షణలో బోధించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అవగాహన చేసుకుని పాఠశాలస్థాయిలో అమలు చేయడం ద్వారా నాణ్య మైన విద్యను అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు పరస్పరం అనుభవాలను పంచుకుంటూ విద్యార్థుల అభ్యాసాన్ని మరింత మెరుగు పరిచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్‌పీఎస్ ఉపాధ్యా యులు, సీఆర్‌పీలు శిక్షణ అందించగా, మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఎస్‌జీటీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**



**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని 30వ వార్డు, 250వ పోలింగ్ బూత్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఓటరు నమోదు ఫారాల పంపిణీ, స్వీకరణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. సమాజంలో మార్పు రావాలంటే ఆ మార్పు ప్రతి వ్యక్తి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఇందులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారం అందని వారు వెంటనే ఈసీఐనెట్ ద్వారా తమ పోలింగ్ బూత్, బీఎల్‌వో వివరాలు తెలుసుకుని ఫారం తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం తీసుకున్న వారు పూర్తిగా నింపి బీఎల్‌వోకు అందజేయాలని లేదా అధికారులు సూచించిన విధంగా సమర్పించాలని తెలిపారు. ఇది కేవలం ఒక ఫారం కాదని, ఓటు హక్కును పరిరక్షించే ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఓటు విలువైనదని, ప్రతి పౌరుడు SIR ప్రక్రియలో పాల్గొని తన బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, కౌన్సిలర్ చంద్రశేఖర్, బీఎల్‌వోలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఐఐటీ ఇండోర్‌లో సీటు సాధించిన జస్వంత్‌కు ఘన సన్మానం



**గద్వాల, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీకి చెందిన విద్యార్థి బి.జస్వంత్ ఐఐటీ ఇండోర్‌లో సీటు సాధించడంతో అయిజ మండల విద్యాశాఖ అధికారి రాములు సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బి.బొజ్జన్న కుమారుడైన జస్వంత్ అయిజలోని అక్షర ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం పూర్తి చేసి, అనంతరం హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఐఐటీ ఇండోర్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు శాలువా కప్పి జస్వంత్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాములు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థి దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం పొందడం గర్వకారణమన్నారు. జస్వంత్ సాధించిన విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకుని సివిల్ సర్వీసుల్లో రాణించి ఐఏఎస్ అధికారిగా ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యు.మహేందర్, ఉపాధ్యాయ బృందం, ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో మంత్రి అజహరుద్దీన్..

- ప్రతికుటుంబానికీ సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యమని వెల్లడి..
- కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం..
- తెలంగాణ సచివాలయంలో మంత్రి అజహరుద్దీన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు..




హైదరాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి




దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిన రెండు కీలక అంశాలు విద్య, గృహనిర్మాణం అని మంత్రి తెలిపారు. సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి సురక్షితమైన సొంత ఇల్లు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్తుకు విద్యే పునాది. రాష్ట్రంలోని ప్రతి బాలుడు, ప్రతి బాలిక నాణ్యమైన విద్యను అభ్యసించి, తెలంగాణను వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి దూరదృష్టి. ఈ లక్ష్య సాధన కోసం ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. భవిష్యత్తులో మరిన్ని విద్యా సంస్కరణలు అమలు చేయబడతాయి. విద్యావంతమైన సమాజమే అభివృద్ధి చెందిన రాష్ట్రానికి బలమైన పునాది అని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం సొంత ఇంటిని కలగా భావిస్తుందని, ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ప్రస్తుతం అమలు చేస్తున్న అత్యంత ముఖ్యమైన సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటని ఆయన అన్నారు. ఈ పథకాన్ని హైదరాబాద్‌లో విజయవంతంగా ప్రారంభించేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులందరినీ మంత్రి అభినందించారు. అలాగే, ఈ పథకాన్ని ప్రజలకు సానుకూల దృక్పథంతో చేర్చాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. వేలాది పేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, గృహనిర్మాణ రంగాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తుందని, సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారని ఏపీఆర్ఓ సయ్యద్ మిన్హాజ్ హుస్సేన్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు..

# జీవరాశి మనుగడకై యాదాద్రి కొండపై వరుణ యాగం ప్రారంభం

- మొదటిరోజు ఆలయంలో గణపతి పూజ పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన పంచగవ్యప్రాసనము రక్షాబంధనం..
- దేవాదాయ ధర్మాదాయశాఖ కొండ సురేఖ ఆదేశాల మేరకు వర్ష పాశుపత వరుణ యాగము

యాదగిరిగుట్ట, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో సమస్త జీవరాశు మనుగడ సాగించుట కొరకై ఈ నెల 23వ తేదీ వరకు వర్ష పాశుపత వరుణ యాగము ప్రారంభమైనది. ఆలయ ఈవో భవాని శంకర్ మాట్లాడుతూ సమస్త జీవరాశి మనుగడ సాగించుట కొరకై జలమే ప్రధానంగా అవసరం ఉన్నది కనుక ఎల్ నినో వలన ఏర్పడిన వర్షాభావ పరిస్థితులలో దేశంలోని, రాష్ట్రంలోనూ తీవ్రమైన అనావృష్టి నెలకొని జనజీవనమంతయు అతలాకుతలం అయ్యే పరిస్థితి ఏర్పడినదని అందుకే దేశము, రాష్ట్రమంతయు సస్యశ్యామలమై పాడిపంటలతో వెలసిల్లాలని సత్సంకల్పముతో విశ్వశాంతి కొరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆదేశాల మేరకు లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయం యొక్క అనుబంధ ఆలయమైన శివాలయము నందు దీక్షతో వర్షా పాశుపత వర్ణ యాగము నిర్వహింపబడుతున్నదని తెలిపారు.



ఈ యాగములో భాగముగా శివ మూల మంత్ర జప వరుణ ఋశ్య శృంగ జపములు మండప ఆరాధనలు శత రుద్రాభిషేకములు విరాటపర్వ పారాయణము మరియు ప్రవచనములు మొదలగు వైదిక కార్యక్రమంలో నిర్వహింపబడుతున్నవని తెలిపారు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపబడు ఈ క్రతువుతో రాష్ట్రమంతయు సమృద్ధిగా వర్షములు కలిసి జల సంపద పశుసంపదలతో, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈ వరుణ యాగం లో స్థానికులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దైవానుగ్రహ పాత్రులు కావాలని ఆలయ ఈవో కోరారు.

## సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు
# సమన్వయమే కీలకం : సైబరాబాద్ సీపీ..

- గోల్కొండ రిసార్ట్‌లో సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో సరిహద్దు నేరాల సమన్వయ సమావేశం..



హైదరాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, సంగారెడ్డి, మెదక్, తదితర సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూ.. సరిహద్దు ప్రాంతాల్లో జరిగే నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ అత్యంత కీలకమని అన్నారు. ఒక కమిషనరేట్ లేదా జిల్లా పరిధిలో నేరానికి పాల్పడి మరో ప్రాంతానికి పారిపోయే నేరస్థులను గుర్తించి, త్వరితగతిన పట్టుకోవడానికి పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ నెట్‌వర్క్, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్రాష్ట్ర ముఠాలు, సైబర్ నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రతి సరిహద్దు పోలీసు యూనిట్ పరస్పరం సమాచారాన్ని వెంటనే పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ తదితర విభాగాల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్లు, నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసే అంశాలపై ప్రజెంటేషన్లు ఇచ్చి, కార్యాచరణ ప్రణాళికలు, అమలు వ్యూహాలను సమావేశంలో వివరించారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై సమాచార మార్పిడి, సంయుక్త చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తక్షణ సమాచార వినిమయం, మిస్సింగ్ వ్యక్తులు, గుర్తుతెలియని మృతదేహాల వివరాల భాగస్వామ్యం, సీసీటీవీ కవరేజ్ విస్తరణ, సైబర్ నేరాలపై సమన్వయం, వీఐపీ బందోబస్తు, మతపరమైన పండుగలు, భారీ కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, సామాజిక ఉద్రిక్తతల నివారణ, సహజ విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయెల్ డావిస్, ఐపీఎస్., కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ ఐ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్., డీసీపీ (క్రైమ్స్) ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డీసీపీ (మహిళా, శిశు భద్రత విభాగం) సృజన కరణం, డీసీపీ సైబర్ క్రైమ్స్ పుష్ప, రోడ్ సేఫ్టీ విభాగం అధికారులు, మెడ్చల్ ఎస్‌వోటీ డీసీపీ, ఎస్‌వోటీ డీసీపీ శోభన్ కుమార్, ట్రాఫిక్ డీసీపీ-2 రవికుమార్, వివిధ సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'పై
# కమలం స్పీడ్..

: తెలంగాణ వ్యాప్తంగా ప్రచారానికి బీజేపీ ప్లాన్



గోదావరిఖని, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' (ఒకే దేశం-ఒకే ఎన్నిక) విధానంపై తెలంగాణలో విస్తృత స్థాయి ప్రచారానికి కమలం పార్టీ సమాయత్తమైంది.రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం భారీ కార్యాచరణను రూపొందించింది. సోమవారం, హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ప్రారంభోపన్యాసం చేసిన ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ జీ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు సహాధ్యక్షులుగా వ్యవహరించారు.ఈ ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి జిల్లాలో ఒక కన్వీనర్, ముగ్గురు సహ-కన్వీనర్లతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల్లో మహిళ, యువత, సోషల్ మీడియా విభాగాల నుంచి ఒక్కొక్కరికి తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించనున్నారు. అలాగే, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించారు. ఇందులో జోన్-1 కు సంబంధించి రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా సోమారావు లావణ్యను, మానిటరింగ్ ఇన్‌చార్జ్‌గా మురళీధర్ బాలాను నియమించారు. జిల్లా స్థాయి కార్యక్రమాల అమలును ఈ జోనల్ బృందాలు పర్యవేక్షించి దిశానిర్దేశం చేస్తాయి.అంతేకాకుండా, డిజిటల్ ప్రచారం, ఆకర్షణీయమైన కంటెంట్ రూపకల్పన కోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సోషల్ మీడియా బృందాన్ని సిద్ధం చేస్తున్నారు.ప్రజల్లోకి ఈ విధానాన్ని బలంగా తీసుకెళ్లేందుకు 200 మందితో కూడిన వక్తల ప్యానెల్‌ను ఏర్పాటు చేయనుండగా, అందులో 30 శాతం మహిళలకు అవకాశం కల్పించనున్నారు.మరోవైపు యువతే లక్ష్యంగా విశ్వవిద్యాలయాలు,డిగ్రీ కళాశాలలు, హాస్టళ్లు ,,జిమ్‌లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,జిల్లాల వారీగా సభలు,ర్యాలీలు,విద్యార్థి సదస్సులు నిర్వహించి ప్రచారాన్ని హోరెత్తించాలని అధిష్ఠానం కార్యాచరణ ఖరారు చేసింది.

## ప్రభుత్వ ఈఎన్‌టీ డాక్టర్‌ను సన్మానించిన సహ చట్టం నాయకులు..



కామారెడ్డి జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు. స్పెషల్ డాక్టర్ బండారి భరద్వాజ్ ని సన్మానించిన సమాచారకు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం రోజున కామారెడ్డి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ బండారి భరద్వాజ్ ఎం.బి.బి.ఎస్., ఎం.డి. చెవి ముక్కు గొంతు స్పెషలిస్ట్ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యుడు డి.రామచందర్ కు ముక్కు తో బాధపడుతూ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఉన్న పేషెంట్ ను చికిత్స చేసి ఆపరేషన్ ద్వారా కేవలం ఒక్క రోజులోనే ప్రత్యేక చేసి సరికొత్త విధానంతో శస్త్రచికిత్స చేసిన ఘనత డాక్టర్ భరద్వాజ్ కి దక్కిందని తెలియజేస్తూ కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలోని అనేకమంది పేద ప్రజలకు, చెవి ముక్కు గొంతుతో బాధపడుతున్న రోగులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకుగాను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తరఫున కామారెడ్డి జిల్లా ప్రతినిధులు, రాష్ట్ర డైరెక్టర్ ఏంఏ సలీం ఘనంగా శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రాజన్న కామారెడ్డి జిల్లా సలహాదారు టి. రామచందర్ మహిళా జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, జిల్లా ప్రతినిధులు ఎం సుధాకర్, రాజు,ప్రదీప్ కుమార్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్
# ఎవరెస్ట్ అధ్యక్షులుగా లయన్ వీరాస్వామి గౌడ్..

- ఏకగ్రీవంగా ఎన్నికైన రిటైర్డ్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్..
- సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో ప్రమాణ స్వీకారం..
- లయన్స్ క్లబ్ సేవలు గ్రామాల్లో విస్తరిస్తాం : వీరాస్వామి గౌడ్..



హైదరాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్టు అధ్యక్షులుగా లయన్ వీరాస్వామి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.. ఈ క్రమంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్ లో జరిగిన ప్రమాణ స్వీకారం మహోత్సవలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. వారితోపాటు కార్యదర్శిగా లయన్ వెంకట్ రెడ్డి, కోశాధికారిగా లయన్ జిల్లా రవీందర్ ప్రమాణస్వీకారం చేశారు.. ఈ కార్యక్రమానికి లయన్స్ పెద్దలు లయన్ నరేందర్ రెడ్డి, పీజీడీ, లయన్ జులూరి రఘు, పీజీడీ, లయన్ హరి నారాయణ బట్టడ్, పీజీడీ, లయన్ మోహనదాస్, స్పెషల్ గెస్ట్‌గా గౌడ హాస్టల్ అధ్యక్షులు చక్రవర్తి గౌడ్, లయన్ ప్రశాంత్ రెడ్డి, ఆర్‌సి, లయన్ అరవింద్, జెడ్‌సి, లియోక్లబ్స్ 320ఏ అధ్యక్షులు శశికుమార్ గౌడ్, ఎవరెస్ట్ క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి లయన్ బుచ్చయ్య చైర్మన్‌గా వ్యవరించారు. కొత్త అధ్యక్షులు లయన్ వీరాస్వామి గౌడ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు నిరుపేద విద్యార్థుల కోసం, గ్రామాలలో వైద్యం కోసం పనిచేస్తాను అని తెలియజేశారు.

## గొడిశెల రాజేశం గౌడ్‌ని పరామర్శించిన దేవరా మల్లప్ప

- త్వరగా కోలుకుని ప్రజాజీవితంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్ష..



హైదరాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల ఎడమ మోకాలికి విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ సీనియర్ మంత్రి, మాజీ తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గొడిశెల రాజేశం గౌడ్‌ని వారి నివాసంలో మాజీ తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ దేవరా మల్లప్ప మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న దేవరా మల్లప్ప వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజా జీవితంలో మరింత చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం రాజేశం గౌడ్, దేవరా మల్లప్పకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని, త్వరలోనే ప్రజల మధ్యకు వస్తానని పేర్కొన్నారు. ఇద్దరూ ఆప్యాయంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోండి..
- సూచించిన జీ.హెచ్.ఎం.సి. చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ..




హైదరాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : జోనల్ కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ పరిధిలోని ఇంజనిరింగ్ సమస్య పై -01 మొత్తం - 01 ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. జోన్ పరిధిలోని మలక్ పేట్, యాకుత్ పురా, సంతోష్ నగర్, చార్మినార్, మూసారం బాగ్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, జోనల్ ఏ యం సీ రాజారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఉచిత కుట్టుమిషన్ల నమోదు..




కొత్తగూడెం జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళలను ఆర్థికంగా స్వావలంభన సాధించే దిశగా ఎఎండిఆర్‌ఫౌండేషన్ ఫర్ సోషల్ ఛేంజ్ ఆధ్వర్యంలో సహకారంతో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ నమోదుకార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం ద్వారా మొదట 200మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించాలని నిర్ణయించగా ప్రజల నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభించి దాదాపు 500మంది మహిళలు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎఎండి.ఆదిల్ మాట్లాడుతూ నమోదైన సుమారు 500మంది మహిళలకు 45రోజులపాటుపూర్తిగా ఉచిత కుట్టు శిక్షణ అందచేస్తామని, అనంతరం శిక్షణలో ప్రతిభ, ఆసక్తి, అర్హత ఆధారంగా 200మంది మహిళలను ఎంపిక చేసి ఉచిత కుట్టు మిషన్లు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని ఫౌండేషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈనమోదుకార్యక్రమానికి షీటీమ్ ఎస్ఐ రమాదేవి, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ అఖిలా, ప్రశాంత్‌నగర్ సర్పంచ్ లైలా పాల్గని మహిళలను ప్రోత్సహిస్తున్నందుకు అభినందించారు. భవిష్యత్తులోకూడా మహిళల, సాధికారత, స్వయం ఉపాధి, సామాజిక అభివృద్ధికోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# నిర్లక్ష్యంగా.. భగీరథ గేట్ వాల్వులు



కోహెడ జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) : కోహెడ ఎక్స్ రోడ్డు నుంచి, మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి లో.. మిషన్ భగీరథ పైపులైన్ గేట్ వాల్వులు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల రెండు వరసల రోడ్డు నిర్మాణం పూర్తయినా.. గేట్ వాల్వులకు రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో.. రాత్రివేళ వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు.

# ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొందాం

**సంగారెడ్డి, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**




ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి,మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు.ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.అనంతరం మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు.అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# జగదాంబ తండా పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ -ఎస్ఎంసీ కమిటీ ఎన్నిక

**నిజామాబాద్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**



సిరికొండ మండలం జగదాంబ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ విద్యా సామగ్రికి ఏఈ తిరుపతి ఆర్థిక సహాయం అందించారు. గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాలవత్ సుగుణ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.అనంతరం పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (SMC) ఎన్నిక నిర్వహించగా, కమిటీ సభ్యులుగా రమేష్, హేమ, వినోద్ తదితరులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి , పంచాయతీ సెక్రటరీ పాషా, ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు నితిన్, మంజుల, మహిపాల్, గంగాధర్, వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.. అధికారంలో ఉండి రైతులకు అన్యాయం చేయడం నీకు తగునా..?



**రాజేంద్రనగర్, (జర్నలిస్ట్ ఫైల్) :** అధికారంలో ఉండి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయకుండా వారి పక్షాన నిలబడ్డందుకు మా నాయకులపై అవకులు చెవాకులు పేల్చడం ఎమ్మెల్యే స్థాయికి తగునా అని శంషాబాద్ టౌన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆరోపించారు.సోమవారం శంషాబాద్ టౌన్బీఆర్‌ఎస్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో బహదూర్ గూడ భూములు హైడ్రా ద్వారా ఆక్రమించబడిన దానిపై విలేకరుల సమావేశంలో వివరించడం జరిగిందన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..నీన్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రైతుల పక్షాన మొసలి కన్నీరు కార్చుటం,ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా తప్పించుకొని తిరుగుతున్న నందుకు ప్రశ్నించడం జరిగిందన్నారు.అంతేకాకుండా ఎమ్మెల్యేగా ప్రకాష్ గౌడ్ మీరు ఈరోజు అధికార పార్టీలో ఉండి మా నాయకులు సబితా ఇంద్ర రెడ్డి,కార్తీక్ రెడ్డిలు రైతుల పక్షాన నిలబడ్డందుకు కించపరిచే విధంగా మాట్లాడడం తగునా అని ప్రశ్నించారు.అలాగే బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులని కించపరిచే విధానం ప్రశ్నించడం మీ రాజకీయ నీతికి నిదర్శనం అన్నారు.ఎకరాకు 500 గజాలు లేదా 600 గజాలు ఇస్తానడం విడ్డూరం అని పించట్లేదా అని నిలదీశారు.దీనికి బీఆర్‌ఎస్ పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.ప్రజల పక్షాన ఎల్లప్పుడూ మా పార్టీ పోరాటం చేసి న్యాయం జరిగిందాకా రైతుల సమక్షన నిలబడి తీరుతామని ఆయన హెచ్చరించారు.మేము రైతుల పక్షాన హైకోర్టులో కేసు దాఖలు చేశాము దానికి రైతుల పక్షాన స్టేటస్ కి ఆర్డర్ వచ్చిన దానికి హైకోర్టు న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.ఇదే మాట వాళ్లకి ధైర్యాన్ని నింపి మేమున్నాం అని చెప్పడం జరిగిందన్నారు.కార్యక్రమంలో శంషాబాద్ టౌన్ మహిళా అధ్యక్షులు మడపతి పరమేశ్వరి,ప్రధాన కార్యదర్శి రాహుల్ గాజుల,బిసి సెల్ అధ్యక్షులు అరజున్,ఆర్గనైజ్ సెక్రటరీ జయ సింహ,జై కృష్ణ-లీగల్ సెల్యూత్ అధ్యక్షులు టిల్లు,ఉపాధ్యక్షులు గడ్డమీద యాదగిరి,హరి గౌడ్,మందాడి వేణు గౌడ్,యాదగిరి,శీను నాయక్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కుల సంఘాలు బలోపేతం కావాలి

## -బీసీలలో చైతన్యం రావాలి



**వనపర్తి, (జర్నలిస్ట్ ఫైల్) :** కుల సంఘాలు బలోపేతం కావాలని, బీసీ వర్గాలలో ఆత్మగౌరవ చైతన్యం కలగాలని వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా శాలివాహన సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సూగూరు రామును పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. వృత్తి పనులనే నమ్ముకుని సమాజ పురోగతికి తోడ్పడుతున్న కుమ్మరులు మట్టిలో మాణిక్యాలని కొనియాడారు. జిల్లాలోని నూరుకు పైగా ఉన్న బీసీ సంఘాల నాయకులు, వారిచే ఎన్నుకోబడిన అధ్యక్ష, కార్యదర్శులందరూ బీసీ నినాదంతో ఒక్కటై సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీసీల ఆత్మగౌరవ పోరాటాలు, చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాటుపడాలన్నారు.బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా శక్తివంతం చేయడానికి అన్ని సంఘాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని, ముఖ్యంగా యువతను విద్యాభివృద్ధి వైపు మళ్లించేలా దిశా నిర్దేశం చేయాలని ఆయన ఆకాంక్షించారు. చదువుకున్న యువతే రేపటి సామాజిక, రాజకీయ చైతన్యానికి నాంది కాగలరని స్పష్టం చేశారు.శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సూగూరు రామును పలువురు రాజకీయ, సామాజిక నేతలు అభినందిస్తూ సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, బిజెపి నాయకులు రవి, రిటైర్డ్ ఉద్యోగి నరసింహులు, అలాగే రాజనగరం రామస్వామి, శివకుమార్, జయ రాములు, చందు యాదవ్, రాము, సాయి కుమార్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం..

**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత అమానుషమని, ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన తీవ్రమైన కుంభకోణమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన అసలు సూత్రధారులను కాపాడుతూ, న్యాయం కోరుతున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగానికి పాల్పడటం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై లాఠీలు ఎత్తడం సిగ్గుచేటని అన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశ యువతకు నాణ్యమైన, పారదర్శకమైన విద్యా వ్యవస్థను అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, కానీ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, అవినీతి, నిర్లక్ష్యంతో విద్యార్థుల విశ్వాసాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు.విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పోలీసుల దౌర్జన్యంపై స్వతంత్ర విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని టి. రామకృష్ణ డిమాండ్ చేశారు.

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు సోమ వారం రోజు వైశాలినగర్ లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిమానుల కోలాహలం తో ప్రారంభమైన సంబరాలు అంబరాన్ని అంటాయి. పూలమాలలు వేసి బొకేలు అందిస్తూ శాలువా లతో సత్కరించి ఆయనకి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో శేరిలింగంపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , మాజీ కార్పొరేటర్ రంగా రావు, గోప రాజు శ్రీనివాస్ రావు,సంగారెడ్డి, బాబుమోహన్ మల్లేష్, దీప్తి రాజు, బి ఎస్ ఎన్ కిరణ్ యాదవ్, ధాత్రి నాథ్ గౌడ్, శ్రీనివాస్, బండి రామకృష్ణ గౌడ్, గణేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అనిల్ రెడ్డి, యాదయ్య, శేఖర్ యాదవ్ తదితరుల తో పాటు నియోజక వర్గం ప్రముఖులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

## కస్తూర్బా పాఠశాలకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి

### -ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ కు జంగయ్య వినతి



**మిడ్జిల్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

మిడ్జిల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత దృష్ట్యా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ కు పెరుమాళ్ళ జంగయ్య వినతిపత్రం అందజేశారు. ఇటీవల కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికను ఆమె తల్లి విడిచి వెళ్లిన అనంతరం ఆ అమ్మాయి పాఠశాల నుండి సుమారుగా 11 కిలోమీటర్లు ఉన్న, ఉర్కొండ మండలంలోని గుట్టల్లో ప్రత్యక్షమైంది. ఇది గమనించిన స్థానికులు వెంటనే పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించడంతో వారు అమ్మాయిని తీసుకెళ్లారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

## సర్ -2026 మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్





**ఖమ్మం, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న సర్ –2026 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బిఎల్ఓ లు నిర్వహిస్తున్న మ్యాపింగ్, డిజిటలైజేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. 30 శాతం కంటే తక్కువ పురోగతి సాధించిన బిఎల్ఓ లను గుర్తించి, పనులు మందగించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలు, ఫీల్డ్ స్థాయి ఇబ్బందులు, వంటి అంశాలపై వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ప్రతి బిఎల్ఓ రోజువారీ లక్ష్యాలను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

## నగర ప్రజలకు మరింత చేరువగా ఖమ్మం నగరపాలక సంస్థ వాట్సాప్ గ్రీవెన్స్ సేవలు

**ఖమ్మం, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

నగర ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన, వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో ఖమ్మం నగరపాలక సంస్థ వాట్సాప్ గ్రీవెన్స్ సేవలను విజయవంతంగా నిర్వహిస్తోంది.నగరంలోని ఏ డివిజన్‌కు చెందిన పౌరుడైనా తమ ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపించి, సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు.వాట్సాప్ ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించి, పరిష్కార చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రతి ఫిర్యాదు పురోగతిని మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత పౌరునికి ఫిర్యాదు స్థితి (స్టేటస్), తీసుకున్న చర్యల వివరాలను కూడా వాట్సాప్ ద్వారా తెలియజేయడం జరుగుతోంది.ఈ సేవల ద్వారా ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి ప్రత్యక్షంగా రావాల్సిన అవసరం లేకుండా, తమ మొబైల్ ఫోన్ నుంచే ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు, సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగేలా వ్యవస్థ పనిచేస్తోంది. నగరంలోని పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, చెత్త సేకరణ తదితర పౌర సమస్యలపై ఫిర్యాదులు చేయదలిచిన వారు తమ సమస్యకు సంబంధించిన వివరాలు, ఫోటోలు, లొకేషన్‌తో పాటు 8333833696 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని ఖమ్మం నగరపాలక సంస్థ కోరుతోంది. ఇప్పటివరకు వాట్సాప్ గ్రీవెన్స్ ద్వారా మొత్తం 249 ఫిర్యాదులు అందగా, వాటిలో 155 ఫిర్యాదులను పూర్తిగా పరిష్కరించారు. మరో 77 ఫిర్యాదులు వివిధ శాఖల పరిధిలో పరిష్కార దశలో (ప్రోగ్రెస్‌లో) ఉన్నాయి. మిగిలిన ఫిర్యాదులపై కూడా అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకుంటూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పర బాలమ్మ ను పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ -త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కుటుంబ సభ్యులకు ధైర్యం



**బోనకల్, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

బోనకల్ గ్రామానికి చెందిన 11వ వార్డు మెంబర్ ఉప్పర శ్రీను తల్లి ఉప్పర బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, గ్రామ సర్పంచి బానోతు జ్యోతి, మాజీ సహకార సంఘం అధ్యక్షులు కొండపల్లి సుధాకర్ రావు బాలమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలను పాటిస్తూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న బాలమ్మ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో తేలూరి రమేష్, మల్లెల యాలాద్రి , అంతటి శ్రీను మరియు గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనారోగ్యంతో ఉన్న బాలమను త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి 'మాట-మంతి

### -గండగలపాడు మార్గంలో పొలాల్లోకి వెళ్లి భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడిచి వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీలు పడ్డారు. 'అక్కయ్యా.. పథకాలన్నీ అందుతున్నాయా?'పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఎంతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు.

**డిప్యూటీ సీఎం అడిగిన ప్రశ్నలివే**

"అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?" "మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా?" "రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?""అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?"ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ"ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఉపముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలుఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నాయకులు వేదికల పైనుంచి మాట్లాడటం చూస్తాం. కానీ, ఇలా స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా.. కాన్వాయ్ ఆపి, పొలంలోకి వెళ్లి కూలీల కష్టసుఖాలు తెలుసుకోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ప్రజా ప్రభుత్వం' అంటే ఇదేనంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

### -సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు



**వైరా (జర్నలిస్ట్ ఫైల్) :** సిపిఎం వైరా డివిజన్ కమిటీ సమావేశం సోమవారం వైరా బోడేపూడి భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామకాల్లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన నిరసనపై కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆదేశాలతో ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న నిరసనకారులను అడ్డుకుని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులపై దాడేనని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువతపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, విద్యా వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరావు, డివిజన్ నాయకులు మచ్చా మణి, దొంతబోయిన నాగేశ్వరావు, బాణాల శ్రీనివాసరావు, కే. నరేంద్ర, చెర్కుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, కొండబోయిన ఉమావతి, తాత పద్మ, ఏర్పుల రాములు, వజ్జా రామారావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తుము సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులి పురుగుల దినోత్సవం





**ఖమ్మం, జూలై 21 (జర్నలిస్ట్ ఫైల్) :**

" జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం" మోప్-అప్ డే,ఖమ్మం నగర పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని క్షేత్రస్థాయిలో డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా పిల్లల్లో నట్టల నివారణే ధ్యేయంగా నిర్వహిస్తున్న, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, మోప్-అప్ కార్యక్రమాన్నిడాక్టర్ డి. రామారావు,సోమవారం క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం నగర పరిధిలోని రస్తోగి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎన్.ఎస్.సి. కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, ఆయన సందర్శించారు. గత వారం నిర్వహించిన ప్రధాన విడతలో వివిధ కారణాల వల్ల, ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేకపోయిన విద్యార్థులకు, ఈ రోజు మోప్-అప్ డే సందర్భంగా టీచర్లు, ఆరోగ్య సిబ్బంది సమక్షంలో మాత్రలు వేయించే ప్రక్రియను డీఎంహెచ్ఓ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ రక్తహీనత నివారణ: పిల్లల కడుపులో ఉండే నులిపురుగులు వారు తినే ఆహారంలోని పోషకాలను హరించి వేస్తాయని, దీనివల్ల పిల్లలు రక్తహీనత పోషకాహార లోపానికి గురవుతారని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని వివరించారు. 100 శాతం లక్ష్యం సాధించాలని,జిల్లాలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి ఒక్క పిల్లవాడికి ఈ మాత్రలు అందేలా వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, అంగన్‌వాడీల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బడి బయట,పిల్లలకు కూడా కవర్ చేసేలా సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచన,మాత్రలను నమిలి మింగేలా చూడాలని, ఖాళీ కడుపుతో కాకుండా భోజనం లేదా అల్పాహారం చేసిన తర్వాతే వేయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక పట్టణ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంపై మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ కోవిడ్ పట్ల భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అక్కడక్కడ నమోదు అవుతున్న కేసులను గమనిస్తున్నామని చెప్పారు పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, జిల్లా యంత్రాంగం దాని పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తుందని చెప్పారు. వైద్యశాఖ అధికారులు, వైద్యులతో చర్చించడం జరిగిందని అన్నారు. పరిస్థితులను ఎదుర్కొనుటకు ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయని, మందులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

## ప్రజల భద్రతకు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్



- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు తదితర సున్నిత ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. పగలు, రాత్రి ప్రత్యేక బృందాలతో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బ్యాంకులు, వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు, దోపిడీలు, విద్యాసంస్థల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులు, అల్లర్లు, అక్రమ నిర్బంధాలు, కిడ్నాప్‌లు, మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. కీలక ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ వాహనాల దొంగతనాలు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెంచినట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సీసీటీఎన్ఎస్, పోలీసు డేటాబేస్ ద్వారా పరిశీలిస్తూ నేరచరిత్రను ధృవీకరిస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లాలోని రౌడీషీటర్లు, గంజాయి కేసుల నిందితుల కదలికలపై ఆర్టీజీఎస్ ఏఐ సీసీటీవీ 360 యాప్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని, అవసరమైన చోట్ల డ్రగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గుంటూరులోని పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అవసరమైన చోట అదనపు నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బ్రహ్మంగారి మఠం పాత గురుకుల పాఠశాలను పునరుద్ధరించాలి - ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని ఏళ్ల చరిత్ర ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధాస్థానానికి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ కి మంగళవారం వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డి పల్లె అరవింద్ లు మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని గురుకుల పాఠశాల ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యను అందించి ఎంతోమందిని ప్రయోజకులను చేసిందని అలాంటి పాఠశాలను తోట్లపల్లి కి తరలించడం జరిగిందని వారు తెలిపారు.

నూతనంగా ఏర్పాటు అయిన మహా గురుకులంలో పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో అక్కడ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని వారు తెలిపారు. మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాత స్కూల్ కు రక్షణ లేనందున వస్తువులన్నీ కూడా మాయమైపోతున్నాయని వారన్నారు. యధా స్థానానికి స్కూల్ తీసుకురావడం వల్ల మండలం డెవలప్మెంట్ అవుతుందని వారు అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే స్పందించి సెక్రటరీ కి కాల్ చేసి యధా స్థానానికి పాత స్కూల్ ను తీసుకురావాలని మండలంలో విద్యార్థులకు సమస్య రాకూడదని త్వరలోనే ఆ సమస్యకు పరిష్కారం కావాలని వారు సెక్రటరీ కి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దేవా, డివైఎఫ్ఐ నాయకులు ఓబులేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానది లంకల్లో పేకాటపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఐదుగురు అదుపులో.. నగదు, వాహనాల స్వాధీనం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణానది లంకల్లో పేకాట నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. డీఎస్‌బీ డీఎస్పీకి సమాచారం అందించి, సీఐ-2 ఆదేశాల మేరకు కృష్ణానది లంకలకు వెళ్లే కరకట్ట వద్ద తనిఖీలు చేపట్టగా, పేకాట స్థలం నుంచి పడవలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు, కాపలా కాస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రాథమిక విచారణలో ఉండవల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేకాట నిర్వహణలో నిర్వాహకుడిగా ఉన్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, ఎనిమిది ద్విచక్ర వాహనాలు, రూ. 25,270 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అదుపులోకి తీసుకున్న వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం తుళ్లూరు పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణానది కరకట్ట, పరివాహక ప్రాంతాల్లో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని గుంటూరు జిల్లా పోలీసులు హెచ్చరించారు.

## ఇజ్రాయిల్ పేటకు మహర్దశ తీసుకొస్తాం : ఎమ్మెల్యే నసీర్

- త్వరలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం ప్రారంభం
- ఇప్పటికే నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు
- అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బ్రాండ్ మార్క్
- క్షేత్రస్థాయి పర్యటనలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ఇజ్రాయిల్ పేటలోని ప్రతి వీధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక 22వ డివిజన్లోని ఇజ్రాయిల్ పేట, గాంధీనగర్ ఆర్టీసీ కాలనీ, వెంకటరావు నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నసీర్ మాటామంతీ కలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి ? శానిటేషన్ సక్రమంగా ఉందా ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం అభివృద్ధికి నోచుకోని ఇజ్రాయిల్ పేటలో రోడ్లు డ్రెయిన్ల నిర్మాణాన్ని మరో 15 నుంచి 20 రోజుల్లో చేపట్టనున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ పైప్ లైన్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పనులు వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించబోతున్నామని అన్నారు. ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా కూటమి నాయకుల వద్దకుగానీ, తన వద్దకుగానీ వచ్చి సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి బ్రాండ్ మార్క్ అనిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

## 24న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 3.1: కలెక్టర్

- లీప్ యాప్‌ను తల్లిదండ్రులు తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ఈ నెల 24న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం-3.1) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 1,048 ప్రభుత్వ పాఠశాలల్లో 90,596 మంది విద్యార్థులు, ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 1,500 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెగా పీటీఎంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా సమావేశమై విద్యార్థుల చదువు, గత 75 రోజులుగా అమలు చేస్తున్న హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు (హెచ్‌పీసీ), గ్యారంటీ ఫండమెంటల్ లెర్నింగ్ అండ్ న్యూమరసి (జీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాల పురోగతిపై చర్చిస్తారని తెలిపారు. అలాగే లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్ ద్వారా విద్యార్థుల అభ్యాస పురోగతిని వివరించడంతో పాటు, సురక్షిత స్పర్శ, సానుకూల తల్లిదండ్రుల పాత్ర, ప్రభుత్వ పాఠశాలల విజయాలు, ఎస్ఎస్‌సీ ఫలితాలు, ఐఐటీల్లో ప్రవేశాలు వంటి అంశాలపై వీడియోలు ప్రదర్శిస్తారని చెప్పారు.

విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు, టీఏఆర్ఎల్, ఎస్ఆర్‌కేవీఎం కిట్లు, క్రీడా సామగ్రి, విద్యార్థులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనతో పాటు తల్లిదండ్రులకు ముగ్గుల పోటీ, నిమ్మకాయ--చెంచా పోటీ, మ్యూజికల్ చెయిర్స్, తాడు లాగుడు వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల నివేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు, లీప్ యాప్ ప్రదర్శన, ప్రశ్నోత్తరాలు నిర్వహించి, పాల్గొన్న వారందరికీ ప్రత్యేక మెనూతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం వడ్డిస్తామని వెల్లడించారు.

తల్లిదండ్రులందరూ లీప్ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తామని, యాప్ ద్వారా తమ పిల్లల విద్యా పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీం భాషా పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందించడమే లక్ష్యం

- ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్
- గుంటూరులో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా సేవలను సరళతరం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్. శాంతిప్రియ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్ల పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. ఇటువంటి అదాలత్‌ల ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ఒకేచోట స్వీకరించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని, పెన్షన్, జీపీఎఫ్ సేవలను మరింత పౌరస్నేహపూర్వకంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారానికి అదాలత్‌లు ఉద్యోగులకు ఉపయోగకరమైన వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఆషిత పట్నాయక్ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్ ప్రాసెసింగ్‌ను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేశామని, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వెబ్ పోర్టల్, గ్రీవెన్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మరో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుషాల్ కార్తీక్ మాట్లాడుతూ ఏసీ, డీసీ బిల్లుల సకాలంలో సర్దుబాటు, ఖాతాల నిర్వహణలో నిబంధనల పాటింపు ప్రభుత్వ ఆర్థిక పారదర్శకతకు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈవో సందీప్ కృపాకర్ గుండాల, జిల్లా ట్రెజరీ డీడీ చంద్రశేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణపై అంబటి వ్యాఖ్యలు సిగ్గుచేటు

- గళ్ళా మాధవిపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నేతల విమర్శ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మహిళల రక్షణ గురించి వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ విమర్శించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతి, అనైతిక ప్రవర్తనకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరుగాంచిన అంబటి మహిళల భద్రతపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. గుంటూరులో జరిగిన ఘటనపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు పోలీసులతో మాట్లాడి నిందితులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్టులకు సహకరించారని తెలిపారు.

కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాభారతంలో ఒక్క కీచకుడు ఉంటే, వైఎస్సార్సీపీలో అలాంటి నాయకులు అనేక మంది ఉన్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో న్యాయస్థానం అంబటి రాంబాబును జైలుకు పంపిందని, అందుకు గళ్ళా మాధవినే కారణమని భావించి ఆయన కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులే ఎమ్మెల్యే తమకు అండగా నిలిచి న్యాయం జరిగేలా కృషి చేశారని చెబుతున్నప్పటికీ, ఆ విషయాన్ని పక్కనబెట్టి రాజకీయ లబ్ధి కోసం అంబటి అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించే అంశాన్ని కూడా రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

మల్లె ఈశ్వర్ రావు మాట్లాడుతూ గళ్ళా మాధవి మహిళల భద్రత, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్న నాయకురాలని, తప్పు చేసిన వారిపై వారు ఏ పార్టీకి చెందిన వారైనా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారని తెలిపారు. తాళ్ళ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ గళ్ళా మాధవికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అంబటి రాంబాబు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, ప్రజాసేవలో గళ్ళా మాధవికి ప్రజలతో పాటు బడుగు, బలహీన వర్గాల పూర్తి మద్దతు ఉందని, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

## గుంటూరులో రోడ్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక

- ఆక్రమణలు రెండు రోజుల్లో తొలగించాలని కమిషనర్ ఆదేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ వేగవంతం చేసినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం కేవీపీ కాలనీ మెయిన్ రోడ్, చిలకలూరిపేట రోడ్, ఏటి అగ్రహారం మెయిన్ రోడ్, ఏటుకూరు రోడ్, నందివెలుగు రోడ్, పొన్నూరు రోడ్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాలను ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) అధికారులు, జీఎంసీ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించారు. నగరానికి అనుగుణంగా రోడ్ కారిడార్ అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి అందించాలని ఏపీజీబీసీ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులను దశలవారీగా ఎవెన్యూ ప్లాంటేషన్, డివైడర్లు, క్రమబద్ధమైన ఫుట్‌పాత్‌లు, ఆధునిక లైటింగ్, సైన్‌బోర్డులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటికే రూపొందించిన ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మార్పులు సూచించినట్లు చెప్పారు. నగర వాతావరణానికి అనుకూలమైన మొక్కలను నాటి, వాటి నిర్వహణ బాధ్యత కూడా కాంట్రాక్టర్‌దే అయ్యేలా నిబంధనలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పర్యటన సందర్భంగా ప్రధాన రహదారుల వెంట డ్రైన్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను గమనించిన కమిషనర్ సంబంధిత ప్లానింగ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను రెండు రోజుల్లో పూర్తిగా తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగేలా నిర్మాణ సామగ్రిని ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛందంగా తొలగించకపోతే సామగ్రిని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఎస్ఈ సుందరరామిరెడ్డితో పాటు ఏపీజీబీసీ, జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



- మహిళా గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను మహిళలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సిరిపురపు అనురాధ అనే మహిళ తన రేషన్ కార్డులో కారు నమోదై ఉండటంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదని, ఆ నమోదును తొలగించాలని కోరగా, మరో మహిళ ఆర్థిక సహాయం అందించాలని, ఇంకొకరు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన మహిళ జీవనోపాధి కోసం తోపుడు బండి మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు.

ఏటి అగ్రహారం నాలుగో లైన్‌కు చెందిన మహిళ తమ పొరుగింటి యజమాని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల తమ ఇంటి కార్యకలాపాలు కూడా చిత్రీకరణకు గురవుతున్నాయని, గోప్యతకు భంగం కలుగుతోందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. అన్ని వినతులను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల విజయాలకు ప్రతీకగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ రాకెట్ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఇంజినీర్‌గా పాల్గొన్న గుంటూరుకు చెందిన కుటుంబరాయుడు పూరుబండిని ఎమ్మెల్యే అభినందించారు. ఆయన సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్టాంప్ రైటర్ల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి తమ వృత్తికి సంబంధించిన సమస్యలను వివరించి, జీవనోపాధికి భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వారి సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కమర్షియల్ చెత్త సేకరణకు ప్రైవేట్ ఏజెన్సీలకు నో

- నగరపాలక సంస్థ సిబ్బందికే వ్యర్థాలు ఇవ్వాలి : కమిషనర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో కమర్షియల్ వ్యర్థాల సేకరణకు అనుమతి పొందిన ప్రైవేట్ ఏజెన్సీల అనుమతులను రద్దు చేసిన నేపథ్యంలో, ఇకపై వాణిజ్య సంస్థల నుంచి నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం సిబ్బందే వ్యర్థాలను సేకరిస్తారని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. చెత్త సేకరణ పేరుతో ఎవరైనా నగదు వసూలు చేస్తే జీఎంసీ కంట్రోల్ రూమ్ 0863-2345103కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వాణిజ్య సంస్థలు ప్రత్యేక డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బందికే అందించాలని కమిషనర్ తెలిపారు. రోడ్లపై, డ్రైన్లలో చెత్త వేయరాదని హెచ్చరించారు. కమర్షియల్ వ్యర్థాల సేకరణతో చెత్త తరలింపు వాహనాల ట్రిప్పులు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వార్డు వారీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసే లేదా 20 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్న లేదా రోజుకు 40 వేల లీటర్లకుపైగా నీటిని వినియోగించే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లు తదితర సంస్థలు బల్క్‌వేస్ట్ జనరేటర్ల పరిధిలోకి వస్తాయని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో 63 బల్క్‌వేస్ట్ జనరేటర్లు నమోదయ్యాయని, వారు తప్పనిసరిగా ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026ను పాటించాలని సూచించారు. నమోదు లేదా ఇతర వివరాల కోసం జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103ను సంప్రదించాలని తెలిపారు.

## పార్టీ ప్రతినిధులతో సర్‌పై సమీక్ష సమావేశం



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో ఉన్నటువంటి పార్టీ ప్రతినిధులతో మైదుకూరు తాసిల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి జాన్ ఇర్విన్ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మండలాల వారిగా పార్టీ ప్రతినిధులు హాజరై ఆయా మండలాల్లో సర్ ప్రక్రియ ఎంత వరకు పూర్తి అయ్యింది అనే అంశం పై ఆరా తీశారు. అనంతరం 97 శాతం సర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని కేవలం 3 శాతం మాత్రమే పెండింగ్ ఉందని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి మండలాల వారిగా వారి లిస్టును సేకరించి వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందించి పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో బి ఎల్. ఎ హరికృష్ణ మరియు వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రాష్ట్రంలో కొత్తగా 7 కరోనా కేసులు




### ○ గుంటూరులో నలుగురికి పాజిటివ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో మంగళవారం కొత్తగా ఏడు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 4, తూర్పుగోదావరిలో 2, బాపట్లలో ఒక కేసు చొప్పున రికార్డ్ అయినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. తాజా కేసులతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 26కు చేరింది. ఇప్పటివరకు 145 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంగళవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.
కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదయ్యాయి. గుంటూరులో ఆరు, తూర్పుగోదావరిలో మూడు, కాకినాడ, బాపట్ల జిల్లాల్లో రెండేసి కేసులు వెలుగుచూశాయి. విశాఖపట్నం, ఏలూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒక్కొక్క కేసు చొప్పున నమోదైంది.
ప్రస్తుతం పది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తొమ్మిది మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. ముగ్గురు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఇప్పటివరకు నలుగురు మృతి చెందారు. మృతులందరికీ కరోనా నిర్ధారణకు ముందే ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు ఆరోగ్యశాఖ పేర్కొంది.
ప్రస్తుతం నమోదవుతున్న కేసులు ఒకే ప్రాంతంలో సమూహంగా కాకుండా, వివిధ జిల్లాల్లో విడివిడిగా వెలుగుచూస్తున్నవేనని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

## మంత్రి లోకేష్‌కు కలెక్టర్ ఘన స్వాగతం



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** పేదలకు శాశ్వత ఇంటి స్థల పట్టాల పంపిణీ కార్యక్రమం లో పాల్గొనేం దుకు మంగళ వారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌కు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మంత్రి లోకేష్‌ను కలెక్టర్ సాయికాంత్ వర్మ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి కార్యక్రమ స్థలాన్ని పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పేదలకు శాశ్వత ఇంటి స్థల పట్టాల పంపిణీ ద్వారా వారి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

## జీవో 396పై మంత్రి దుర్గేష్‌కు దస్తావేజుల లేఖర్ల వినతి



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మంగళవారం నిడదవోలు దస్తావేజుల లేఖర్ల సంఘం ప్రతినిధులు కలిసి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 396ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా లేఖర్ల వృత్తిలో కొనసాగుతూ ప్రజల ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సేవలందిస్తున్నామని వారు తెలిపారు.
ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో అమలుతో దస్తావేజుల లేఖర్లతో పాటు డీటీపీ ఆపరేటర్ల ఉపాధికి కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం తాము పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
వారి వినతిపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. లేఖర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశీలించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని లేఖర్లకు సూచించారు.

## జీఐసీ ఇంజినీర్‌కు బీజేపీ ఘన సన్మానం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** దేశ రక్షణ, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల అభివృద్ధిలో సేవలందిస్తున్న జీఐసీ ఇంజినీర్ గ్రౌండ్ టెస్టింగ్ బృందానికి చెందిన ఊరుబండి కుటుంబరాయుడిని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు ఘనంగా సన్మానించి అభినందించారు. దేశ సేవలో ఆయన అందిస్తున్న సేవలు గర్వకారణమని కొనియాడారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ దేశ అభివృద్ధి, భద్రతకు తోడ్పడుతున్న నిపుణులు దేశానికి ఆస్తి అని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మరింత నిబద్ధతతో సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో కూడా దేశ అభివృద్ధికి తన వంతు సేవలందించి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఊరుబండి కుటుంబరాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. వి. సుబ్బారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శులు కె. నారాయణరెడ్డి, నారదాసు వీరమణి తదితరులు పాల్గొని ఊరుబండి కుటుంబరాయుడిని అభినందించి ఘనంగా సన్మానించారు.

## రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయం-పారిశ్రామిక రంగాలపై చర్చ







### ○ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మతో అచ్చెన్నాయుడు భేటీ

**న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, పారిశ్రామిక ప్రగతిపై విస్తృతంగా చర్చించారు.
రైతులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యాలు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు కేంద్ర సహకారం అందించాలని అచ్చెన్నాయుడు కోరారు. అలాగే రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూల పరిస్థితులు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి రంగాల్లో మరింత వేగంగా పురోగతి సాధించవచ్చని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు వెల్లడించారు.

**ఉపరాష్ట్రపతితో కేంద్ర, రాష్ట్ర మంత్రుల భేటీ**

ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ సహకారం తదితర అంశాలను ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రగతి, రైతుల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుపై ఈ సందర్భంగా చర్చ జరిగింది.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా క్యాన్సర్ బాధితురాలికి రూ.5 లక్షల వైద్యసాయం

### ○ వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**భట్టిప్రోలు (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన జంజనం మల్లేశ్వరికి రూ. 5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరైంది. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయం అందింది.
వైద్య చికిత్సకు అవసరమైన బిల్లులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించగా, ప్రభుత్వం పరిశీలించి రూ. 5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను మంజూరు చేసింది.
మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి ధైర్యం చెప్పారు. మల్లేశ్వరి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హ కుటుంబానికి అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, అవసరమైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌తో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరయ్యేలా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్య, నైపుణ్యం, క్రీడా వికాసంతో ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే నసీర్


- ○ రాష్ట్రంలో క్రీడలకు మంచి అవకాశాలు
- ○ అన్ని నియోజకవర్గాల్లో క్రీడా మైదానాల అభివృద్ధి
- ○ రూ.14 కోట్లతో బిఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- ○ అమరావతి చాంపియన్ షిప్-2026 ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విద్య, నైపుణ్యం, క్రీడా వికాసం కలిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో అమరావతి ఛాంపియన్షిప్ 2026 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడల ప్రోత్సాహానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ అన్ని రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ప్రతి నియోజకవర్గంలో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి పంపించనున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన వారికి కోటి రూపాయల విలువైన బహుమతులను ప్రదానం చేయనున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేసి వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి విజయావకాశాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో మూడు శాతం కోటా అమలు చేయడం కారణంగా మంచి అవకాశాలు రానున్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక రూ. 14 కోట్ల రూపాయలతో బీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

## కృష్ణబాబు కాలనీ ఘటనపై అసత్య ప్రచారాలకు కఠిన చర్యలు

### ○ బాధిత మహిళ వీడియోలు షేర్ చేసినా కేసులు: జిల్లా ఎస్పీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణబాబు కాలనీలో జరిగిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వేగంగా చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జూలై 16న అందిన ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నెం. 268/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 331(6), 79, 115(2), 118(1) రెడ్ విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఘటనలో పాల్గొన్న తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, వారికి న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంపాలెం సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.
ఈ ఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులు బాధిత మహిళకు సంబంధించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేస్తూ ఆమె ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై క్రైమ్ నెం. 273/2026 కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 67 ప్రకారం మరో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.
అసత్య ప్రచారాలు చేయడం, బాధిత మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆమె గౌరవానికి భంగం కలిగించే వీడియోలను ప్రసారం చేయడం లేదా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తారని ఎస్పీ హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఉద్యోగ సంఘాలతో నేడు మంత్రుల బృందం సమావేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించేందుకు మంత్రుల బృందం బుధవారం ఉదయం 11.30 గంటలకు ఏపీ సచివాలయం 5వ భవనంలోని కలెక్టర్ల సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం కానుంది. ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.
ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా మంత్రి సత్యకుమార్ యాదవ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారు.
అలాగే రాష్ట్ర ప్రభుత్వంలోని 10 శాఖలకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు కూడా సమావేశానికి హాజరుకానున్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ డిమాండ్లు, సమస్యలను మంత్రుల బృందం దృష్టికి తీసుకురానుండగా, వాటిపై ప్రభుత్వ వైఖరి, తదుపరి చర్యలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

## రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా డా. నళినిదేవి బాధ్యతల స్వీకరణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా డా. నళినిదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు.
బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. నళినిదేవి మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచి, శిక్షణ పొందే సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.
ఈ సందర్భంగా రీజినల్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది డా. నళినిదేవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నాయకత్వంలో శిక్షణ కేంద్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## స్త్రీ,శిశు,దివ్యాంగ,సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై బుధవారం అసెంబ్లీ కమిటీ సమావేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఈనెల 22వ తేది బుధవారం ఉ.10.30 గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో మహిళా శిశు దివ్యాంగ,సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్లో జరగనుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలియజేశారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి టిడ్కో కాలనీలో 700 భారీ మొక్కలు



### ○ రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు విశిష్ట కార్యక్రమం

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో మంగళగిరి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో 700 భారీ మొక్కల నాటకం చేపట్టారు. 15 నుంచి 20 అడుగుల ఎత్తు కలిగిన మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా-3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ్ సుధీర్ పీలాని పిలుపు మేరకు, రాష్ట్రప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా-3150 జిల్లా చైర్మన్ (సర్వీస్ ప్రాజెక్ట్స్) డా. ఏకేఎస్ రవి వడ్లమాని ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. రాష్ట్రస్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్. కె. అలీం బాషా, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు ఎం. కె. వి., జిల్లా చైర్మన్ అన్నె రత్న ప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ గాజుల శ్రీనివాసరావుతో పాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పరేపల్లి నిరంజన్ గుప్తా, కార్యదర్శి వడ్లమూడి శ్రీనివాసరావు, కోశాధికారి చానుమోలు గోపాలరావు, డైరెక్టర్ బత్తు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరిలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో పచ్చదనంపై అవగాహన పెంచుతున్నాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం : అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో వక్తలు

### ○ ఓటర్ల అర్హతపై 9-సోపానాల అధ్యయనం చేపట్టిన ఏపీ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంగా కొనసాగాలంటే ప్రజల భాగస్వామ్యమే అసలైన బలమని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అమూల్యమైన శక్తి అని వక్తలు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్, భారత ఎన్నికల సంఘం, ఇంటర్నేషనల్ ఐడియా, ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో ఓటర్ల అర్హతపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులు, విద్యావేత్తలు, నిపుణులు, విద్యార్థులు ప్రత్యక్షంగా, వర్చువల్‌గా పాల్గొన్నారు.
ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతానికి బాధ్యతాయుతమైన ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ఓటు హక్కు కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన అవగాహన కార్యక్రమాల వల్ల దేశంలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగిందని, ఉపాధి లేదా ఉద్యోగ కారణాల వల్ల స్వగ్రామాలకు రాలేని ఓటర్లను కూడా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసే మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అక్షరక్రమంలోనే కాదు, పోలింగ్ శాతంలోనూ దేశంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఓటు హక్కు విశిష్టతను యువత గుర్తించి సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ ఓటర్ల అర్హత అంశంపై తొమ్మిది సోపానాల విధానంలో క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపయోగపడే నమూనా ప్రమాణాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి 18 ఏళ్లు నిండిన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా పారదర్శకమైన, లోపరహిత ఓటర్ల జాబితా తయారే లక్ష్యమని వివరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి. కె. బాలాజీ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ ఓటర్ల నమోదు కేవలం పరిపాలనా ప్రక్రియ కాదని, అది రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని అన్నారు. ఓటర్ల జాబితా పవిత్రతను కాపాడేందుకు చట్టపరమైన కచ్చితత్వంతో పాటు మానవతా దృక్పథం కూడా అవసరమని చెప్పారు. వర్క్‌షాప్‌లో ఓటర్ల అర్హత, అంతర్జాతీయ ప్రమాణాలు, చట్టపరమైన విధానాలు, డేటా మోడళ్లపై పలు సాంకేతిక సమావేశాలు నిర్వహించగా, దేశ విదేశాల నిపుణులు తమ అనుభవాలను పంచుకొని ఎన్నికల సంస్కరణలపై సూచనలు చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467